## ఢిల్లీలో ఏడాదంతా పటాసులపై నిషేధం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: నగరంలో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకోవటంతో పటాసులపై పూర్తిస్థాయిలో నిషేధం విధించినట్టు ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో అన్ని రకాల పటాసులపై ఢిల్లీ తరహా నిషేధాన్ని అమల్లోకి తేవాలని హర్యానా, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీలో గాలి కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గత కొద్ది రోజులుగా విచారణ జరుపుతున్నది. పూర్తిస్థాయిలో బ్యాన్ విధించలేమని సుప్రీంకు యూపీ తెలియజేసింది.

## ఐదుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు కద్దేర్‌లోని బేహిబాగ్ ప్రాంతంలో బుధవారం రాత్రి నుంచి పోలీసులు, భద్రతా సిబ్బంది కలిసి ఉమ్మడిగా నిర్బంధ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వారిపై కొందరు ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో వీరు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో ముజాహిదీన్ టాప్ కమాండర్ ఫారూక్ అహ్మద్ భట్ అలియాస్ నలి సహా ఐదుగురు మరణించారు. ఫారూక్ పలు ఉగ్రవాద నేరాలతో సంబంధాలున్నాయని అధికారులు తెలిపారు.

## అంతుబట్టని వ్యాధితో 8 మంది బాలల మృతి

శ్రీనగర్: జమ్మూ కశ్మీరులోని రాజౌరీ జిల్లాలో అంతుబట్టని వ్యాధితో 8 మంది బాలలు ప్రాణాలు కోల్పోయారు. వీరు బధాల్ గ్రామంలోని రెండు కుటుంబాలకు చెందినవారు. వైద్య పరీక్షలు చేయడంతోపాటు వ్యాధిని త్వరగా గుర్తించడం కోసం బీఎస్ఎల్-3 మొబైల్ ల్యాబొరేటరీని రాజౌరికి పంపించారు. జమ్మూలోని వైద్య కళాశాల, దవాఖానలో ఆరు రోజుల పాటు చికిత్స పొందిన 12 ఏళ్ల బాలుడు బుధవారం తుది శ్వాస విడిచాడు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది.

# పార్లమెంటులో తోపులాట

- ఇండియా - ఎన్డీఏ ఎంపీల మధ్య బాహాబాహి
- అంబేద్కర్‌కు అవమానంపై ఇరుపక్షాల ఆందోళన
- పార్లమెంటు మకరద్వారం వద్ద ఎంపీల గలాటా
- బీజేపీ ఎంపీలు సారంగి, ముకేశ్‌కు గాయాలు
- రాహుల్ గాంధీ తోసేయడం వల్లే.. బీజేపీ ఆరోపణ
- వారి ఎంపీలే ఖర్గే, రాహుల్‌ను నెట్టేశారు: కాంగ్రెస్



పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అధికార, విపక్ష ఎంపీల నిరసన



బీజేపీ ఎంపీ సారంగి అంబులెన్స్‌లోకి తరలింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు ప్రాంగణం ఇండియా - ఎన్డీఏ ఎంపీల కొట్లాటకు వేదికైంది. ఇంత కాలం సభ లోపల వాగ్వాదాలకు పరిమితమైన ఇరు పార్టీల ఎంపీలు గురువారం సభ బయట బాహాబాహికి దిగారు. ఈ ఘటన పార్లమెంటు ప్రాంగణంలో ఉద్రిక్తతలకు దారి తీసింది. అంబేద్కర్‌ను ఉద్దేశించి పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఈ వివాదం మొదలయ్యింది. అమిత్ షా వ్యాఖ్యలు అంబేద్కర్‌ను అవమానించడమేనని ఆరోపిస్తూ గురువారం ఉదయం పార్లమెంటు ప్రాంగణంలో కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఎస్పీ సహా ఇండియా కూటమి ఎంపీలు నీలం రంగు దుస్తులు ధరించి, ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీనే అంబేద్కర్‌ను అవమానించిందని ఆరోపిస్తూ బీజేపీతో పాటు ఎన్డీఏ ఎంపీలు సైతం ఆందోళనకు దిగారు. పార్లమెంటు మకరద్వారం వద్ద ఇరు పక్షాల ఎంపీలు ఎదురుపడి, పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. దీంతో ఇరు పక్షాల ఎంపీల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒడిశాలోని బాలాసోర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర సారంగి(59)కి నుదుటి ఎడమ భాగంలో గాయమైంది. మరో బీజేపీ ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్ కూడా గాయపడ్డారు.

**రాహుల్ గాంధీ తోసేయడం వల్లే: బీజేపీ**

గాయపడిన ప్రతాప్‌చంద్ర సారంగి వద్దకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేయగా 'సిగ్గు లేదా రాహుల్.. రౌడీయిజం చేస్తున్నావు' అంటూ బీజేపీ ఎంపీ నిషికాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ నెట్టేయడం వల్ల తమ ఎంపీలకు గాయాలయ్యాయని ఆయన ఆరోపించారు. దవాఖానకు తరలించేటప్పుడు ఎంపీ సారంగి మీడియాతో మాట్లాడుతూ.. 'నేను మెట్ల వద్ద ఉన్నప్పుడు రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేయగా, ఆయన నాపైన పడటంతో నేను కింద పడ్డాను' అని పేర్కొన్నారు. కాగా, రాహుల్ వైఖరి వల్ల అసౌకర్యానికి గురయ్యానని నాగాలాండ్ బీజేపీ మహిళా ఎంపీ ఫాంగ్నాన్ కొన్యక్ ఆరోపించారు. 'నేను పార్లమెంటు బయట శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే రాహుల్ గాంధీ నాకు అతి సమీపంగా వచ్చి నిలబడటంతో నేను అసౌకర్యానికి గురయ్యారు. తర్వాత రాహుల్ నాపైకి గట్టిగా అరవడం ప్రారంభించారు' అని ఆమె పేర్కొన్నారు.

**బీజేపీ ఎంపీలే చేయి చేసుకున్నారు: కాంగ్రెస్**

మరోవైపు బీజేపీ ఎంపీలు రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను తోసేశారని, రాహుల్ గాంధీపై చేయిచేసుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. బీజేపీ ఎంపీలు నెట్టేయడం వల్ల తాను కింద పడ్డానని, దీంతో మోకాలి గాయాలు తీవ్రమయ్యాయని, శస్త్రచికిత్స అవసరం అవుతుందని ఖర్గే ఆరోపించారు. తనపై దాడి ఘటనపై విచారణకు ఆదేశించాలని లోక్‌సభ స్పీకర్‌కు ఆయన లేఖ రాశారు. 'పార్లమెంటులోకి వెళ్తుంటే బీజేపీ ఎంపీలు నన్ను అడ్డుకున్నారు. తోసేసి, బెదిరించారు. అసలు అంశం ఏంటంటే.. బీజేపీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. అంబేద్కర్‌ను అవమానిస్తున్నది' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ ఎంపీలే తమ ఎంపీలను అడ్డుకున్నారని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ పలు వీడియోలను విడుదల చేసింది. ఇదంతా అమిత్ షాను కాపాడేందుకు బీజేపీ చేస్తున్న కుట్ర అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ ఆరోపించారు.

**పరస్పరం పోలీసులకు ఫిర్యాదు**

పార్లమెంటు ఘటనలపై బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. కాంగ్రెస్ ఎంపీలపై బీజేపీ బృందం డీసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా రాహుల్‌పై కేసు నమోదైంది. బీజేపీ ఎంపీలపై కాంగ్రెస్ బృందం ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.

**ఉభయ సభల్లోనూ వాగ్వాదం**

అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పార్లమెంటు ఉభయ సభల్లో ఇండియా కూటమి ఎంపీలు ఆందోళనకు దిగారు. ఇరు సభలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరు సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

## అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాలలు

**రాజీనామా చేసి, క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్**

న్యూఢిల్లీ: రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. షా వ్యాఖ్యలు అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించడమేనని విపక్ష పార్టీల నేతలు కేజ్రీవాల్, లాలూ ప్రసాద్ యాదవ్ తదితరులు మండిపడ్డారు. అమిత్ షా తన పదవికి రాజీనామా చేసి, క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో షా వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనలు జరిగాయి. మహారాష్ట్రలోని లాతూర్‌లో వంచిత్ బహుజన్ అఘాడీ(వీబీఏ) నేతృత్వంలో అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే షాపై ఆయన రాజ్యసభలో సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. కాగా, కాంగ్రెస్ పార్టీనే అంబేద్కర్‌ను అవమానించిందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం పేర్కొన్నారు.

## ధన్‌ఖడ్‌పై 'అభిశంసన' నోటీస్ తిరస్కరణ

**సదుద్దేశం లేనందువల్లేనన్న డిప్యూటీ చైర్మన్**


న్యూఢిల్లీ, డిసెంబర్ 19: రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌పై విపక్షాలు ఇచ్చిన అభిశంసన తీర్మానం నోటీస్‌ను సభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ గురువారం కొట్టివేశారు. దేశ రాజ్యాంగబద్ధ సంస్థల ప్రతిష్ఠను తగ్గించేలా, ఉప రాష్ట్రపతిని కించపరిచేలా తీర్మానం దురుద్దేశంతో ఉందని హరివంశ్ అభిప్రాయపడ్డారు. ధన్‌ఖడ్‌ను విపక్షం వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని, ప్రచారం కోసం అభిశంసనను కోరిందని ఆయన తన రూలింగ్‌లో పేర్కొన్నారు. తనపై వచ్చిన అభిశంసన తీర్మానం నోటీస్ పరిశీలన నుంచి ధన్‌ఖడ్ వైదొలగడంతో డిప్యూటీ చైర్మన్ దాన్ని పరిశీలించి తిరస్కరించారు. ఉప రాష్ట్రపతి తొలగింపునకు సంబంధించిన 67(బీ) అధికరణ కింద ఇచ్చే ఏ నోటీస్‌నైనా కనీసం 14 రోజుల ముందు ఇవ్వాలని స్పష్టం చేశారు. విపక్షం ఇచ్చిన నోటీస్‌కు సదుద్దేశం లేదన్నారు.



## ప్రపంచంలో మొదటి 'ఫెర్టిలో' శిశువు జననం

**ఐవీఎఫ్‌కు ప్రత్యామ్నాయ విధానం**

లిమా, డిసెంబర్ 19: 'ఫెర్టిలో' అనే సరికొత్త సంతానోత్పత్తి విధానంతో ప్రపంచంలోనే మొదటిసారి ఓ శిశువు జన్మించింది. ఫెర్టిలో పద్ధతి ద్వారా గర్భం దాల్చిన ఓ మహిళ.. పెరూ దేశ రాజధాని లిమాలోని సాంటా ఇసాబెల్ క్లినిక్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు. అమెరికాలోని గేమ్టో అనే సంస్థ ఈ కొత్త సంతానోత్పత్తి విధానాన్ని అభివృద్ధి చేసింది. ప్రస్తుతం సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులు ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) ద్వారా పిల్లలకు జన్మనిస్తున్నారు. అయితే, ఈ ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖరీదైనది కావడం, కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉండటం వంటి సవాళ్లు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా గేమ్టో సంస్థ ఫెర్టిలో అనే విధానాన్ని అభివృద్ధి చేసింది. ఐవీఎఫ్ విధానంలో అండాలు పరిపక్వం చెందేలా ప్రేరేపించడానికి దాదాపు 90 హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ఈ విధానం ఖరీదైనదిగా మారింది. ఈ ఫెర్టిలో విధానంలో మహిళ నుంచి అండాన్ని సేకరించి ల్యాబ్‌లో పరిపక్వం చెందేలా చేస్తారు. ఇందుకు ఇండ్యూస్డ్ ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్(ఐపీఎస్‌సీ) నుంచి సేకరించే ఓవరియన్ సపోర్ట్ సెల్స్(ఓఎస్‌సీ)ను వినియోగిస్తారు. దీంతో హార్మోన్ ఇంజెక్షన్ల అవసరం గణనీయంగా తగ్గడంతో పాటు మొత్తం ప్రక్రియ వేగవంతం అవుతుందని, సైడ్ ఎఫెక్ట్స్ తగ్గుతాయని గేమ్టో సంస్థ చెప్తున్నది. అండం పరిపక్వం చెందిన తర్వాత చేసే మిగతా ప్రక్రియ మొత్తం ఐవీఎఫ్‌లానే ఉంటుంది.



## ముఖాన్ని స్కాన్ చేస్తే ఆరోగ్యం ఎలా ఉందో చెప్పేస్తుంది!

**హైదరాబాద్ స్టార్టప్ కొత్త టెక్నాలజీ**

హైదరాబాద్: ఫోన్ కెమెరాతో ముఖాన్ని స్కాన్ చేస్తే ఆరోగ్యం ఎలా ఉందో చెప్పే కొత్త సాంకేతికతను హైదరాబాద్‌లోని ఆసియానా అనే స్టార్టప్ గురువారం అందుబాటులోకి తెచ్చింది. ఈ సంస్థ వైద్య సేవలు అందించే 'సియానాహెల్త్' యాప్‌ను నిర్వహిస్తున్నది. ఈ యాప్‌లోనే ఈ కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టింది. ఇందుకోసం కెనడాకు చెందిన జెనెవా ఫేస్ స్కాన్ అనే సంస్థతో జట్టు కట్టింది. ఈ యాప్ ద్వారా 30 సెకన్ల పాటు ముఖాన్ని స్కాన్ చేస్తే 25 పారామీటర్లలో ఆరోగ్యం ఎలా ఉందో క్షణాల్లో నివేదిక వస్తుంది. బాడీ మాస్క్ ఇండెక్స్, గుండె జబ్బుల ముప్పు, గుండెపై ఒత్తిడి, మధుమేహం, బీపీ ముప్పు వంటివి తెలుస్తాయి. ఏఐ ద్వారా ఈ సాంకేతికత పని చేస్తుంది.



## వాట్సాప్‌లోనూ చాట్‌జీపీటీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ వేదిక ఓపెన్ ఏఐ మరో కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి చాట్ జీపీటీ కోసం ఎలాంటి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోనక్కర్లేదు. దాని సేవలను నేరుగా వాట్సాప్‌లోనూ వినియోగించుకోవచ్చునని ఓపెన్ ఏఐ ప్రకటించింది. వేరే యాప్, అకౌంట్‌తో సంబంధం లేకుండా నేరుగా వాట్సాప్‌లోనే దీనిని వాడవచ్చు. +18002428478 నంబర్‌తో వాట్సాప్‌లో చాట్ చేయవచ్చు. మనం అడిగిన సందేహాలు, ప్రశ్నలకు ఇది సమాధానం చెపుతుంది. ఇంతకాలం కెనడా, అమెరికాలకే పరిమితమైన సేవలు ఇకనుంచి భారత్‌లో కూడా పొందవచ్చు. అయితే దీని రోజువారీ వాడుకపై పరిమితి ఉంటుంది. మెటా ఏఐ చాట్‌బాట్‌కు పోటీగా ఓపెన్‌ఏఐ దీనిని వాట్సాప్‌లో ప్రవేశపెట్టింది.

## మరింత త్వరితంగా వీసా అపాయింట్‌మెంట్

**గడువును తగ్గించిన అమెరికన్ ఎంబసీ**



న్యూఢిల్లీ, డిసెంబర్ 19: అమెరికా వెళ్లాలనుకొనే భారతీయులకు వీసా అపాయింట్‌మెంట్‌పై కొత్త నిబంధనలను అమలుచేయనున్నట్టు ఆ దేశ రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ నిబంధనలు జనవరి ఒకటో తేదీనుంచి అమలులోకి వస్తాయని తెలిపింది. కొత్త నిబంధనల ప్రకారం వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచి చూసే గడువు తగ్గుతుందని పేర్కొంది. అందరికీ సమాన అవకాశాలు లభించేలా ఈ మార్పులు చేసినట్టు తెలిపింది. వీసా కోసం దరఖాస్తు చేసుకొనేవారు ఒకవేళ తమకు లభించిన అపాయింట్‌మెంట్ రోజున వెళ్లడం వీలుకాకపోతే అదనపు ఫీజు చెల్లించకుండానే ఆ రోజును మరో తేదీకి మార్చుకోవచ్చని వివరించింది. రెండోసారి కూడా వీలుకాకపోతే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకొని, తగిన రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. తాము కోరుకున్న ప్రదేశంలోనే వీసా అపాయింట్‌మెంట్‌కు వెళ్లవచ్చని తెలిపింది. ప్రస్తుతం బీ1/బీ1 విజిటర్ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచి చూసే గడువు హైదరాబాద్‌లో 429 రోజులు, చెన్నైలో 479 రోజులు, ఢిల్లీలో 441 రోజులుగా ఉంది.

# కర్ణాటకలో మరో బాదుడు

- మోటారు వాహనాల రిజిస్ట్రేషన్లపై అదనపు సెస్
- సవరణ బిల్లును ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రజలపై మరో భారం తగదని బీజేపీ విమర్శ



బెంగళూరు, డిసెంబర్ 19: ప్రజలపై మరో బాదుడుకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇప్పటికే పలు భారాలు మోపి ప్రజలను ఇబ్బంది పెడుతున్న సిద్ధరామయ్య సర్కార్ తాజాగా, మోటార్ వాహనాల రిజిస్ట్రేషన్‌పై అదనపు సెస్‌ను విధించనుంది. ఈ మేరకు ప్రభుత్వం కర్ణాటక మోటారు వాహనాల పన్ను చట్టం, 1957ను సవరిస్తూ అసెంబ్లీలో ఒక బిల్లును ఆమోదించింది. దీని ప్రకారం ఇకపై కొన్న కొత్త ప్రైవేట్ ద్విచక్ర వాహనాలు, కార్లకు రూ.500, 1000 అదనపు సెస్‌ను వసూలు చేస్తారు. రవాణా రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా డ్రైవర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది సుమారు 30 లక్షల మంది ఆధారపడి ఉన్నారని, ఈ క్రమంలో వారి సంక్షేమం కోసం ఒక బోర్డును కూడా ఏర్పాటు చేశామని రవాణా శాఖ మంత్రి రామలింగా రెడ్డి తెలిపారు. వీరికోసం ఖర్చయ్యే నిధులను సమకూర్చడానికి ఇది ఒక శాశ్వత మూలాధారం అవుతుందని చెప్పారు. ఏటా దీని ద్వారా రూ.300 కోట్ల ఆదాయం వస్తుందని, దీనిని కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి ఖర్చు చేస్తామని ఆయన తెలిపారు.

**ప్రజలను బాధ పెట్టడం మానుకోండి: బీజేపీ**

వాహనాలపై అదనపు సెస్ విధింపుపై బీజేపీ విమర్శలు చేసింది. 'ఐదు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు లేక కటకటలాడుతున్నది. దీంతో ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషిస్తూ ప్రజలపై అదనపు భారాలను మోపుతున్నది' అని ఆరోపించింది. ఇప్పటికే ఇంధనంపై పన్నులను అధికం చేశారు. ఇప్పుడు వాహనాలపై కూడా ఈ అదనపు భారం ఎందుకు? ప్రజలను ఇలా పన్నులతో బాధపెట్టడం మానుకోండి అని బీజేపీ నేత అశోక డిమాండ్ చేశారు. ఐదు గ్యారంటీల వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.60,000 కోట్ల భారం పడుతున్నదని బీజేపీ నేత, మాజీ మంత్రి అశ్వత్ నారాయణ పేర్కొన్నారు. కేంద్రం నుంచి కూడా వచ్చే ఆదాయమార్గాలు ఎండిపోవడంతో కొత్తగా ఎలాంటి పన్నులు, భారాలు విధించాలి? అన్న లక్ష్యంతోనే పాలన సాగిస్తున్నదని పేర్కొన్నారు.

## భారీ యుద్ధానికి చైనా సిద్ధం?!

వాషింగ్టన్: చైనా భారీ యుద్ధానికి సిద్ధమవుతున్నదని అమెరికా రక్షణ శాఖ కార్యాలయం తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఇందుకోసం డ్రాగన్ దేశం తగినన్ని అణ్వాయుధాలు, యుద్ధ సామాగ్రిని సమకూర్చుకుంటున్నదని తెలిపింది. పెంటగాన్ నివేదిక ప్రకారం ప్రస్తుతం చైనా దగ్గర 600 అణుబాంబులు, 400 దీర్ఘ శ్రేణి ఖండాంతర క్షిపణులు, 1300 మధ్య శ్రేణి అణు క్షిపణులు ఉన్నాయని పెంటగాన్ తెలిపింది. వీటిని భారత్, ఫిలిప్పీన్స్, జపాన్‌పై ప్రయోగించే అవకాశం ఉందని అంచనా వేసింది. అణ్వాయుధాల నిల్వ కోసం చైనా కొత్తగా మూడు భూగర్భ బంకర్లను నిర్మించిందని చెప్పింది. చైనా తన అణ్వాయుధాలను మరింత ప్రాణాంతకంగా ఆధునీకరిస్తున్నదని పెంటగాన్ తన నివేదికలో పేర్కొంది.



## ఎలాన్ మస్క్ రష్యా ఏజెంట్?

వాషింగ్టన్, డిసెంబర్ 19: ఏరోస్పేస్ కంపెనీ స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ రష్యా ఏజెంట్ అని అమెరికన్ మిలిటరీ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. విదేశీ నేతలతో జరిగిన సమావేశాల గురించి అమెరికన్ అధికారులకు తెలియజేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, మస్క్ పదే పదే చాలా మంది విదేశీ నేతలతో జరిగిన సమావేశాల గురించి బయటపెట్టలేదని 'న్యూయార్క్ టైమ్స్' ఓ కథనాన్ని ప్రచురించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా మస్క్ సమావేశమయ్యారని, ఆ విషయాన్ని మస్క్ బయటపెట్టలేదని ఈ కథనం ఆరోపించింది.

# పోర్న్‌కు ప్రత్యామ్నాయం అవసరం

- అశ్లీలం కంటే ఆసక్తికరంగా ఉండాలి
- అడల్ట్ కంటెంట్ ప్రపంచ సమస్య
- రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యలు



మాస్కో: యువతకు వ్యసనంగా మారుతున్న పోర్నోగ్రఫీ సమస్య పరిష్కారానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనదైన సూచనలు చేశారు. పోర్న్ కంటెంట్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలను ఆకర్షించే మరింత ఆసక్తికరమైన, ఉత్సాహవంతమైన కంటెంట్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గురువారం 'రష్యా టుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పోర్నోగ్రఫీపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అడల్ట్ కంటెంట్‌కు రష్యాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్నదని, ఇది ప్రపంచమంతటి సమస్య అని అంగీకరించారు. పోర్న్ కంటెంట్‌ను నిషేధించడం అనేది ఈ సమస్య నివారణకు ఒక మార్గమని, అయితే పోర్న్ కంటెంట్ కంటే మరింత ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయాలు చూపించడం ముఖ్యమని ఆయన అన్నారు. రష్యాలో తగ్గిపోతున్న జనాల రేటును పెంచేందుకు పుతిన్ ఇటీవల చేసిన సూచనలు సైతం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. పని చేసేవారు లంచ్, కాఫీ బ్రేక్‌లలో శృంగారంలో పాల్గొని పిల్లల్ని కనాలని పిలుపునిచ్చారు.

గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్య..

## కోర్టుకెక్కిన భర్త

అహ్మదాబాద్ : గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్యను వెతికి పెట్టాలంటూ ఒక వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. స్వలింగ సంపర్కురాలైన తన భార్య అక్టోబర్‌లో తన ప్రియురాలితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిందని, ఆ సమయానికి ఆమె ఏడునెలల గర్భవతి అని ఆయన కోర్టుకు విన్నవించాడు. దీనిపై చాంద్‌ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు తన భార్య ఆచూకీని కనుగొనలేకపోయారని తెలిపాడు. కాగా, ఆమెను ఈ నెల 23లోగా తమ ముందు హాజరుపర్చాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

భర్త మరణానంతరం పునర్వివాహం చేసుకున్న

## మహిళకు ఆస్తిలో వాటా

**మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు**



చెన్నై, డిసెంబర్ 19: మహిళల ఆస్తి హక్కుకు సంబంధించి మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. భర్త మరణానంతరం మళ్లీ పెండ్లి చేసుకునే భార్యకు హిందూ వివాహ చట్టం ప్రకారం మరణించిన భర్త ఆస్తిలో వాటా పొందే హక్కు ఉంటుందని తీర్పులో పేర్కొంది. కేసు వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని సేలంకు చెందిన సేవి గౌండర్ మరణానంతరం ఆయన వారసులైన చిన్నయ్యన్, ఆయన సోదరులకు ఆస్తులు సంక్రమించాయి. అయితే చిన్నయ్యన్ మృతి చెందాక ఆయన భార్య మల్లిక రెండో వివాహం చేసుకుంది. తన భర్త ఆస్తుల్లో వాటా ఇవ్వాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సేలం సివిల్ కోర్టు కొట్టివేసింది. దీనిపై ఆమె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. భర్తను కోల్పోయిన మహిళకు ఆస్తిలో వాటా లేదని హిందూ వివాహ చట్టం చెప్పలేదని, పునర్వివాహం చేసుకున్న మహిళకు ఆస్తిలో హక్కులేదన్న సెక్షన్‌ను 2005లోనే రద్దు చేశారని పేర్కొన్న న్యాయమూర్తి జస్టిస్ కుమరప్పన్ ఆమెకు ఆస్తిలో హక్కు ఉందని, ఆమెకు చెందాల్సిన ఆస్తులను అప్పగించాలని తీర్పు చెప్పారు.


## భార్యపై 50 మందితో రేప్.. భర్తకు 20 ఏండ్ల జైలు

**ఫ్రాన్స్‌లో న్యాయస్థానం తీర్పు**

పారిస్: సభ్య సమాజం తలదించుకునేలా భార్య పట్ల అమానుషంగా ప్రవర్తించి, కొందరు అపరిచితులతో భార్యను అనేక ఏండ్లు రేప్ చేయించిన భర్తకు ఫ్రాన్స్‌లోని ఒక కోర్ట్ 20 ఏండ్ల శిక్ష విధించింది. భార్యకు మత్తుమందు ఇవ్వడమే కాక, ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో ఆమెపై అత్యాచారం చేయించి, దానిని వీడియో రికార్డింగ్ చేసిన 72 ఏండ్ల డొమినిక్ పెలికాట్ అమానుష చర్యలు వెలుగులోకి రావడంతో ప్రపంచమంతా నివ్వెరపోయింది. ఇలాంటి భర్త కూడా ఉంటాడా ఈసడించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు డొమినిక్‌కు, అతనితో పాటు దశాబ్దం పాటు సాగిన ఈ అమానుష చర్యలో భాగస్వాములైన మిగిలిన 50 మందికి శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. కోర్టు తీర్పు పట్ల ఫ్రెంచ్ నగరం అవిగ్నాన్‌లో బాధితురాలి బంధువులు, మద్దతుదారులు సంబరాలు జరుపుకున్నారు. 'తాను మిగిలిన వారి మాదిరిగా రేపిస్టునని, మిగిలిన వారు కూడా పూర్తి స్పృహతో ఆ పని చేశారని 'విచారణ సందర్భంగా డొమినిక్ వెల్లడించాడు. కాగా, కోర్టు విచారణ సందర్భంగా తన గురించిన వివరాలను గోప్యంగా ఉంచే హక్కు ఉన్నప్పటికీ బాధితురాలు గిసెల్ దానిని తిరస్కరించింది. తన భర్త తీసిన దారుణ వీడియోలను కోర్టులో చూడాలని, అప్పుడే ఇలాంటి దారుణంపై ఇతర మహిళలకు మాట్లాడటానికి అవకాశం కలుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

## గంటకు 5 వేల కిలోమీటర్ల వేగం!

**సూపర్‌సానిక్ ఇంజిన్‌ను పరీక్షించిన చైనా**



బీజింగ్, డిసెంబర్ 19: పౌర విమానయానంలో అత్యంత వేగవంతమైన సూపర్‌సానిక్ విమాన ఇంజిన్‌ను చైనా సైంటిస్టులు తయారుచేశారు. గంటకు 5వేల కిలోమీటర్ల వేగంతో(మ్యాక్-4 స్థాయి) ప్రయాణించగల సూపర్‌సానిక్ జెట్ ఇంజిన్‌ను చైనా విజయవంతంగా ప్రయోగించింది. 20 కిలోమీటర్ల ఎత్తులో సూపర్‌సానిక్ ఇంజిన్ ఒక గంటకు 5,000 కిలోమీటర్ల వేగాన్ని అందుకుందని చైనా ఆన్‌లైన్ మీడియా పేర్కొన్నది. బీజింగ్ నుంచి న్యూయార్క్‌కు కేవలం రెండు గంటల్లో చేరుకోగల శక్తివంతమైన ఎయిర్‌క్రాఫ్ట్‌ను తీసుకురావాలన్న లక్ష్యంలో భాగంగా ఈ సరికొత్త ఇంజిన్‌ను చైనా ఇటీవలే ఆవిష్కరించింది. 'జిన్‌డో400'గా పేర్కొంటున్న ఈ ఇంజిన్‌ను ఆ దేశంలోని 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్' అనే కంపెనీ అభివృద్ధి చేసింది. షింజు యూనివర్సిటీ సైంటిస్టులు ఇంజిన్‌ను డిజైన్ చేశారు. సాంప్రదాయ విమాన ఇంజిన్లలో ఉన్నట్టు దీంట్లో టర్బైన్లు, కంప్రెషర్లు ఉండవు. శబ్ద తరంగాల నుంచి పుట్టిన శక్తి ఇంజిన్లను నడిపిస్తుంది. సూపర్‌సానిక్ ప్యాసింజర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను చైనా కంపెనీ 2027నాటికి తీసుకురాబోతున్నది. ఇందుకు సంబంధించి తొలి కమర్షియల్ హై-స్పీడ్ ఫ్లైట్‌ను 2030కల్లా ప్రవేశపెడతామని కంపెనీ తెలిపింది.

## కోడిగుడ్డు ధర 21 వేలు!


**వేలంలో పోటీ పడి మరీ కొనుగోలు**



లండన్, డిసెంబర్ 19: సాధారణంగా ఓ కోడిగుడ్డు ధర రూ.6-7 ఉంటుంది. అయితే, యూకేలో మాత్రం ఓ కోడిగుడ్డు ఏకంగా రూ.21 వేలకు అమ్ముడుపోయింది. పైగా దీనిని కొనేందుకు ఔత్సాహికులు పోటీ పడ్డారు. అండాకారంలో ఉండే సాధారణ కోడిగుడ్లకు భిన్నంగా గుండ్రంగా ఉండటమే ఈ కోడిగుడ్డు ప్రత్యేకత. ఏమాత్రం తేడా లేకుండా, పూర్తి గుండ్రంగా ఉండే కోడిగుడ్లు చాలా అరుదుగా కనిపిస్తాయని, వంద కోట్ల గుడ్లలో ఒకటి ఇలా ఉంటుందని చెప్తున్నారు. బెర్క్‌షైర్‌కు చెందిన ఎడ్ పౌనెల్ అనే వ్యక్తి మొదట దీన్ని ఒక పబ్‌లో సుమారు రూ.16 వేలకు కొన్నారు. అయితే, అరుదైన ఈ గుడ్డును దాతృత్వ వేలం కోసం వినియోగించాలని నిర్ణయించి ఇవెంటస్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇచ్చారు. ఈ ఫౌండేషన్ నిర్వహించిన వేలంలోనే అసాధారణ రీతిలో రూ.21 వేలకు ఈ కోడిగుడ్డు అమ్ముడుపోయింది.

## ఉగాండాలో 'డింగా డింగా' వైరస్

**డ్యాన్స్ చేస్తున్నట్టుగా రోగుల్లో తీవ్రమైన వణుకు**



న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ఆఫ్రికా దేశం 'ఉగాండా'లో అంతుబట్టని వ్యాధి ప్రబలింది. 'డింగా డింగా' వైరస్‌గా పేర్కొంటున్న దీనిబారిన పడ్డవాళ్లలో రోగ లక్షణాలు అంతుబట్టని విధంగా ఉంటున్నాయి. డ్యాన్స్ చేస్తున్న మాదిరి రోగి శరీరం తీవ్రస్థాయిలో వణకటంతో ఈ వ్యాధికి 'డింగా డింగా' అనే పేరు పెట్టారు. ఉగాండాలోని బుందిబుగియో జిల్లాలో 300మందికిపైగా వైరస్ సోకింది. ఇందులో అత్యధికంగా మహిళలు, బాలికలు ఉండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. రోగుల్లో కొంతమంది పక్షవాతానికి గురవుతున్నారని తెలిసింది. అంతుబట్టని విధంగా ప్రబలుతున్న ఈ వ్యాధిపై ఉగాండా ఆరోగ్యశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వైరస్ కారణంగా మరణాలు నమోదుకాలేదు. రోగులకు యాంటీబయాటిక్స్ ఇస్తూ వైద్యులు చికిత్స చేస్తున్నారని, వారంలోగా రోగులు కోలుకుంటున్నారని జిల్లా వైద్య అధికారి డాక్టర్ కియాతా క్రిస్టోఫర్ చెప్పారు. 1518లో వచ్చిన 'డ్యాన్సింగ్ ప్లేగు'కు డింగా డింగా వైరస్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయట. 'డింగా డింగా' వైరస్ సోకినవాళ్లలో తీవ్రమైన జ్వరం, శరీరం తీవ్రంగా వణకటం, ఎటూ కదల్లేని నిస్సత్తువ మొదలైన లక్షణాలు ఉన్నాయి. కొంతమందిలో పరిస్థితి తీవ్రస్థాయికి చేరుకోగా.. పక్షవాతం బారిన పడ్డారని ఓ వార్తా ఏజెన్సీ తెలిపింది.